ఇలాగైతే.. శుభకార్యాలెలా?



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద కల్యాణ మండపంలో మహిళల టైలరింగ్ శిక్షణ



జీవీఎంసీ కల్యాణ మండపం ఆవరణలో స్థానికులు నిర్వహిస్తున్న వివాహ వేడుకలు

- స్థానికుల అవసరాలకు దూరంగా జీవీఎంసీ కల్యాణ మండపం
- మండపంలో టైలరింగ్ శిక్షణ.. బయట వివాహ వేడుకలు
- వేరే చోట శిక్షణ ఇవ్వాలని.. మండపం అందుబాటులో ఉంచాలని ఆరిలోవ వాసుల విజ్ఞప్తి
- కుదరదన్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ: వివాహాది, ఇతర శుభకార్యాలు జరగాల్సిన జీవీఎంసీ కల్యాణ మండపాలను బీసీ కార్పొరేషన్ మహిళలకు శిక్షణ కోసం ఉపయోగించుకుంటోంది. తమ ఇళ్లలో జరిగే వేడుకలకు మండపాలు అందుబాటులో లేకుండా పోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాగైతే బంధుమిత్ర సపరివారంతో కలిసి శుభకార్యాలు జరుపుకోవడం కష్టంగా మారుతుందని వాపోతున్నారు.

నియోజకవర్గంలోని బీసీ మహిళలకు కొద్ది రోజులుగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. దీనికోసం 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపంలో ఒక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఇక్కడ శిక్షణ వద్దంటూ స్థానికులు అడ్డుకున్నారు. వేరే చోట సామాజిక భవనాల్లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని, ఇది ప్రజలకు శుభకార్యాలు చేసుకోవడానికి వీలుగా ఉంచాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును, అధికారులను వేడుకున్నారు. ఎమ్మెల్యే ససేమిరా అనడంతో బీసీ కార్పొరేషన్ అధికారులు మహిళలకు మూడు నెలల కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభించేశారు. దీంతో ఈ కల్యాణ మండపం స్థానికుల అవసరాలకు దూరమైంది.

వానలో ఇబ్బంది పడుతూ.. వివాహ వేడుక

ప్రస్తుత సీజన్‌లో ఏ కార్యక్రమం చేయాలన్నా.. ఏ వేడుక జరపాలన్నా.. స్థానికులకు రహదార్లే దిక్కవుతున్నాయి. ఈ కల్యాణ మండపం అందుబాటులో లేకపోవడంతో బుధవారం స్థానికంగా ఓ కుటుంబంలో జరిగిన వివాహానికి ఇబ్బందిగా మారింది. ఇంటి ముందు చేసుకోవడానికి రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. మరో వైపు కల్యాణ మండపం కుట్టు శిక్షణ కేంద్రంగా మారిపోయింది. దీంతో చేసేదేం లేక మండపం ఆవరణలోనే టెంట్లు వేసుకుని స్టేజీ ఏర్పాటు చేసుకున్నారు. దానిపై ఆ కుటుంబం వివాహ వేడుక జరిపించాల్సి వచ్చింది.

కానరాని పెళ్లి సందడి

రోజంతా వర్షం కురవడంతో ప్రాంగణమంతా బురదగా మారి పెళ్లి సందడి లేకుండా పోయిందంటూ బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కల్యాణ మండపాలు లేవు. ఉన్నదాన్ని కుట్టు శిక్షణ కేంద్రంగా మార్చేశారు. బయట ప్రాంతాల్లో కల్యాణ మండపాలు బుక్ చేసుకోవడానికి ఇక్కడ నివసిస్తున్న పేదలకు ఆర్థిక స్థోమత చాలదు. దీంతో స్థానికులు శుభకార్యాలు జరుపుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే తీరుపై మండిపాటు

'ఇటువంటి పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఇదేం తీరు ఎమ్మెల్యే వెలగపూడి గారూ.. మా ఆరిలోవ ప్రజలపై ఇంత చిన్నచూపేలా' అని అంటూ స్థానికులు మండిపడుతున్నారు. దీనికి దగ్గరలోనే అన్న క్యాంటీన్ వెనుక ఖాళీగా ఉన్న సామాజిక భవనంలో కుట్టు శిక్షణ ఏర్పాటు చేసి ఉంటే ఇక్కడ కల్యాణ మండపం స్థానికుల అవసరాలకు ఉపయోగపడేదని అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల అవసరాలను పట్టించుకోకుండా తూతూ మంత్రంగా టైలరింగ్ శిక్షణ జరిపించుకుపోతున్నారని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి శిక్షణ కేంద్రాన్ని వేరే చోటకు మార్చాలని కోరుతున్నారు.

ఎంవీపీ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న లక్ష్మి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ప్రభుత్వ నగర శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మి విద్యార్థులచే ధ్యానం, యోగాసనాలు చేయించారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రతి రోజూ గ్రంథాలయంలో యోగాసనాలు శిక్షణ అందించాలన్నారు. ఎంవీపీ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింప జేసి, ఉదయం 9.30 నుంచి వివిధ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

క్లుప్తంగా

ఐపీఆర్ పీజీ డిప్లొమా విద్యార్థులకు అభినందన



కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ డిప్లొమో ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్స్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏడాది కాల వ్యవధి కలిగిన ఈ కోర్సులో పలువురు వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజినీర్లు, ఉన్నత విద్యావంతులు చేరి విజయవంతంగా పూర్తి చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆవిష్కరణకు ప్రాధాన్యమిస్తూ మేధోహక్కుల పరిరక్షణకు ఏయూ ఐపీఆర్ చైర్ చేస్తున్న కృషిని రిజిస్ట్రార్ అభినందించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఆరిలోవ: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, నూకరాజు, శ్రీనివారెడ్డి తదితరులు నివాళులర్పించారు. 10వ వార్డు రవీంద్రనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి నాయకులు రాజశేఖర్, అప్పలనాయుడు, 11వ వార్డు బాలాజీనగర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ముగడ రాజారావు, మూది అప్పారావు తదితరులు నివాళులర్పించారు. 12వ వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి ఏడువాక సన్యాసిరావు తదితరులు, 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ, బాలస్వామి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని అమ్మమ్మపై దాడి

ఎంవీపీకాలనీ: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని అమ్మమ్మపై దాడి చేసిన పి.మహేష్ అనే యువకుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. అప్పుఘర్‌కు చెందిన కొండా మగ్రమ్మకు ఇద్దరు కుమార్తెలు.. ఒక కుమార్తె కొడుకైన మహేష్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం కోసం కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఇటీవల అమ్మమ్మ మగ్రమ్మను మద్యం తాగడానికి డబ్బులు అడిగాడు. ఆమె దగ్గర లేవని చెప్పడంతో అప్పటికే మద్యం తాగి ఉన్న మహేష్ స్టీల్ జగ్‌తో ఆమెపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా కేజీహెచ్‌లో మగ్రమ్మ చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తుంపల హర్షిత అనే యువతి పెదవాల్తేర్ కాగితాల వారి వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 26న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. రెండు రోజులుగా యువతి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా.. ఫలితం లభించలేదు. హర్షిత తండ్రి వేణుగోపాల్ బుధవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముసురు వాన



పిఠాపురం కాలనీ రహదారిలో నిలిచిన వర్షపు నీరు

మద్దిలపాలెం: ముసురు వర్షంతో నగరం తడిసిముద్దవుతోంది. రెండు రోజులుగా చిరుజల్లులతో ప్రారంభమైన వాన బుధవారం రోజంతా చినుకులు పడుతూనే ఉంది. పిఠాపురం కాలనీ, కేఆర్ఎం కాలనీ తదితర పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోయింది. జనజీవనం ఇబ్బందులకు గురయ్యారు. విధులకు వెళ్లి వచ్చే సమయంలో వర్షంతో ఇబ్బందులు పడుతున్నారు.

పిల్లలకు ఆట స్థలాలు దూరం



ఆరిలోవ హెల్త్‌సిటీ పక్కన ఖాళీ స్థలంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం చేస్తున్న ఏర్పాట్లు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో క్రీడా స్థలాలు లేక పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చినా.. విద్యార్థులు ఆటలాడుకోవడానికి ఖాళీ స్థలాల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న ఖాళీ స్థలాల్లో తరచూ రాజకీయ నాయకులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు కార్యక్రమాలు నిర్వహించుకుపోతున్నారు. ఆరిలోవ కాలనీ సమీపం హెల్త్‌సిటీని అనుకుని ఉన్న ఖాళీ స్థలం ఒక్కటే ఈ ప్రాంతంలో ఉన్న వేల మంది పిల్లలకు ఆటలాడుకోవడానికి ఆశాదీపంలా మారింది. ఆ స్థలాన్ని కూడా కొందరు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడానికి వినియోగించుకొని పిల్లలకు దూరం చేస్తున్నారు. వారం కిందట నాలుగు రోజుల పాటు ఓ సంస్థ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించింది. ఇప్పుడు మరికొందరు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ఈ మైదానంలో గోతులు తీసి టెంట్లు, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేసుకుపోతున్నారు. దీంతో పిల్లలు ఎక్కడ ఆడుకోవాలో తెలియక ఇంటికి పరిమితమవుతున్నారు. ఓ పక్క క్రీడలు పిల్లలకు వ్యాయామం, ఆరోగ్యాన్ని ఇస్తాయంటూ అధికారులు ఊదరగొడుతున్నారు. మరో పక్క ఖాళీ స్థలాల్లో ఆటలాడుకోవడానికి ఆటంకాలు కలుగుతున్నా.. నివారించడం లేదని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏవైనా కల్యాణ మండపాలు బుక్ చేసుకొని నిర్వహించుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఆచార్య షారోన్ రాజ్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎస్.టి.రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషిని వివరించారు. ఏయూలో ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆయన క్రీడా దుస్తులను బహూకరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పోషకాహారాన్ని వితరణ చేశారు. డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, పరిశోధకులు పాల్గొన్నారు.

◆ ఏయూలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏయూ రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, దూర విద్య సంచాలకులు ఆచార్య ఎస్.విజయమోహన్, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా శిక్షణ తరగతులు



తోటగరువు స్కూల్ మైదానంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న గాంధీనగర్ అర్బన్ హాస్టల్ విద్యార్థులు

ఆరిలోవ: విశాఖలో ఈ ఏడాది జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం విద్యా శాఖ ఆదేశాలతో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, చినగదిలి సీఆర్‌పీఎస్‌లు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, గాంధీనగర్ అర్బన్ రెసిడెన్సియల్ హాస్టల్‌లో పిల్లలకు యోగాసనాలు నేర్పించారు. 10 నుంచి 18 ఏళ్ల వయసు గల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు నేర్చుకున్నారు. యోగా దినోత్సవం వరకు విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తామని ఏఎల్ఎస్‌వో తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం



వైభవ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో గ్రామ సంఘ సభ్యులు, అర్చకులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం రామాలయంలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7.30 గంటలకు అర్చన సేవ, విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచనం, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, మండపారాధన, అష్టోత్తర శత కలశారాధన, స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం విశేష హోమాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సం ఘనంగా జరిపారు. భక్తులంతా గోవింద నామాన్ని జపించారు. చివరిగా పుష్పాంజలి పవళింపు సేవతో వేడుకలు ముగించారు. ఆలయ అర్చకులు నాళ్ల చెరువు రామకృష్ణాచార్యులు సారథ్యంలో పలువురు పండితులు భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపారు. సంఘ అధ్యక్షుడు పీలా కనకరాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు మాట్లాడుతూ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల ఆదరణ పెరుగుతూ వస్తోందన్నారు. వేడుకల్లో కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ యూపీహెచ్‌సీ పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలిచ్చారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను పెంపు నిర్ణయం దుర్మార్గం



ధర్నా చేస్తున్న వార్వా, నివాస్ సభ్యులు

- ఉపసంహరించుకోవాలని వార్వా, నివాస్ సంస్థల ధర్నా

బీచ్‌రోడ్డు: ఆస్తుల సర్వే పేరుతో ప్రాపర్టీ ట్యాక్స్ విలువంటూ ఇంటి పన్ను 20 శాతం పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్వా, నివాస్ సంస్థల సభ్యులు సంయుక్తంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణాల్లో ఆస్తుల సర్వే ద్వారా 20 శాతం అదనంగా ఆస్తిపన్ను సమీకరించాలని రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబ ఇటీవల ఆదేశించారని గుర్తు చేశారు. దానికనుగుణంగా ఈ నెల 14న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర విభాగం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. నగరాలు, పట్టణాల్లో ఆస్తులను సర్వే చేసి టాక్స్ అసెస్మెంట్ కానివి, పన్ను విధించవలసిన దాని కంటే తక్కువగా టాక్స్ అసెస్మెంట్ జరిగినవి గుర్తించి, వాటిపై సవరించిన ఆస్తి పన్ను, పెనాల్టీలు వేసి, ప్రతి నగరంలో ఆస్తి పన్ను ఆదాయాన్ని 20 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని ఆదేశాలు పంపించడం దుర్మార్గమని మండిపడ్డారు. తక్షణమే ఆస్తి పన్ను సర్వే ఆపి, పాత పద్ధతిలోనే ఇంటి పన్ను వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో నివాస్ అధ్యక్షుడు బి.గురప్ప, వార్వా కార్యదర్శి బీబీ గణేష్, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా వ్యర్థాలతో నిండిన గెడ్డ

ఏయూక్యాంపస్: కాలువల్లో ఉన్న వ్యర్థాలు వర్షాల ప్రభావంతో కొట్టుకువచ్చి గెడ్డల్లో పేరుకుపోతున్నాయి. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్ ఎదురుగా ఉన్న గెడ్డలో భారీగా వ్యర్థాలు నిల్వ ఉన్నాయి. వర్షాలు మరింత పెరిగితే గెడ్డలో పూడికలు తొలగించడం కూడా కష్టమవుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో భారీగా వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివి కొట్టుకువచ్చి గెడ్డలో పేరుకుపోతున్నాయి. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది సత్వరమే గెడ్డలో పూడికలను తొలగించి, మురుగు ప్రవాహాన్ని సరిచేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

జూలో ధోల్ డే సందడి



ఆసియాటిక్ వైల్డ్ డాగ్ చిత్రం వేస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం ప్రపంచ ధోల్ డే(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ చిత్రాలతో అలరించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అడవి కుక్కల జాతినే ధోల్‌గా పిలుస్తారని తెలిపారు. ధోల్ ప్రపంచంలో ధోల్ ప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. దీని బ్రీడింగ్ సెంటర్‌ను విశాఖ జూలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ డాగ్స్‌పై అవగాహన కల్పించడానికి పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. జూలో ప్రస్తుతం 47 ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని, వాటిలో 28 మగవి కాగా.. 19 ఆడవి అన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో వేసిన అడవి కుక్కల చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

తీరం.. ఉధృతం

కెరటాలు ఎగిసిపడుతున్న వేళ.. జాగ్రత్త!



ఎగసి పడుతున్న సముద్ర కెరటాలు

ఏయూక్యాంపస్: సముద్ర తీరం ఉధృతంగా దర్శనమిస్తోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో కెరటాలు ఎగసి పడుతున్నాయి. అదే సమయంలో నగరవాసులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి వస్తున్నారు. భారీగా ఎగసిపడుతున్న కెరటాలు సుదూరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు కెరటాల వద్ద ఆడుతూ సేదతీరుతున్నాయి. సాధారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండే సమయంలో తీరంలోకి వెళ్లడం అంత శ్రేయస్కరం కాదు. కెరటాల తీవ్రత కూడా అధికంగా ఉంటోంది. ఇటువంటి సమయంలో నగరవాసులు, పర్యాటకులు తీరంలోనికి రావడం, కెరటాలతో ఆటలాడటం కనిపిస్తోంది. మరికొంత మంది ఫొటోలు తీసుకోవడం, రీల్స్ చేయడం వంటివి చేస్తున్నారు. అనుకోని ప్రమాదం ఏదైనా సంభవిస్తే ఎవరు బాధ్యులనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటువంటి సమయంలో ప్రజలు సాగర తీరంలోకి వెళ్లకుండా ఉండటం శ్రేయస్కరం. ముఖ్యంగా తుఫాన్‌లు, రుతుపవనాల ఆగమనం సందర్భంలో మరింత జాగ్రత్తగా ఉండాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

లెండీ వనం అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



మాట్లాడుతున్న సత్యప్రసాద్

బీచ్‌రోడ్డు: ఈస్ట్ పాయింట్ కాలనీ లెండీ వనం జీవీఎంసీ పార్కులో రెండున్నర దశాబ్దాలుగా ఓ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు సత్యప్రసాద్ తెలిపారు. జీవీఎంసీ పార్కులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సూరిరెడ్డి హయాంలో ఈ పార్కు నిర్వహణ బాధ్యత తమకు అప్పగించారన్నారు. అప్పటి నుంచి సొంత నిధులతో బాబా కుటీరం, శివలింగం, ధ్యాన మందిరం ఏర్పాటు చేసి రాశి, నక్షత్ర వనాలను, పవిత్రమైన పూల మొక్కలను సంరక్షిస్తున్నామని చెప్పారు. ఇందులో వాకింగ్ ట్రాక్, యోగా సదుపాయాలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం వల్ల ఎంతో మంది భక్తులు ప్రతి రోజూ వస్తుంటారన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పార్కు నిర్వహిస్తున్నా.. కొంత మంది బురద జల్లుతున్నారని ఆరోపించారు. హుద్‌హుద్ సమయంలో పార్కు పూర్తిగా పాడైందని, ఇటీవల రోడ్డు విస్తరణలో కూడా దక్షిణ వైపు భాగం రహదారిలో కలిసిపోగా.. సొంత నిధులతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. పార్కు అభివృద్ధిని చూసి కొంత మంది ఓర్వలేక పలు రకాల ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.